సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



పట్టదా ఎవరికీ..?

భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

8లో



నిధులు అరకొరే..

జెన్‌కో యాజమాన్యం సామాజిక బాధ్యతగా వెచ్చించాల్సిన నిధులు అరకొరగానే విడుదల చేస్తోంది.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
29° / 23°

జిల్లాలో సోమవారం ఉదయం ఒకటి, రెండు జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

శ్రీకనక దుర్గమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లి ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనక దుర్గమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పీఓ పేర్కొన్నారు.

నేడు కొత్తగూడెం, భద్రాచలంలో ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజల సౌకర్యం కోసం డివిజన్ల వారీగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం భద్రాచలం రెవెన్యూ డివిజన్ ప్రజలు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం రెవెన్యూ డివిజన్ ప్రజలు కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు హాజరై తమ సమస్యల దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో కూడా ప్రజలు సమస్యల దరఖాస్తులను అందజేసి రశీదులు పొందవచ్చని, సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపిస్తామని వివరించారు.

కిన్నెరసానిలో సండే సందడి



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్య లో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాల నడుమ సరదాగా గడిపారు. 496మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,390 ఆదాయం లభించింది. 480మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.24,410 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనుమతి లేకపోతే కఠిన చర్యలు

ఎస్పీ రోహిత్‌రాజు



కొత్తగూడెంటౌన్: దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసుల షాపులను నిర్దేశిత ఖాళీ స్థలాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొందుపర్చాలని తెలిపారు. క్లస్టర్‌లో 50 షాపులకు మించి ఉండొద్దని, జనావాసాల్లో టపాసుల షాపులు ఏర్పాటు చేయొద్దని, కల్యాణ మండపాల్లో, సమావేశ ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేయొద్దని అన్నారు. తాత్కాలిక దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. షాపుల వద్ద ఇసుక, నీటి సదుపాయాలను అందుబాటులోఉంచుకోవాలని కోరారు. ఆయా శాఖల అధికారుల అనుమతులు పొందాకే షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉపాధిలో ఈకేవైసీ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, (ఇన్‌సెట్) ఈకేవైసీ నమోదుకు ఫొటో తీస్తున్న ఉపాధి సిబ్బంది

- అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- కూలీల ఆధార్‌కార్డు, జాబ్‌కార్డుల వివరాలు యాప్‌లో నమోదు
- జిల్లాలో కొనసాగుతున్న ఈకేవైసీ ప్రక్రియ

ఉపాధి హామీ పథకం వివరాలు	
జాబ్‌కార్డులు	2.23 లక్షలు
మొత్తం కూలీలు	4.58 లక్షల మంది
యాక్టివ్ కూలీలు	2.21 లక్షల మంది
ఈకేవైసీ చేసినవారు	1.09 లక్షల మంది
ఇంకా చేయాల్సినవారు	1.11 లక్షల మంది

చర్ల/చుంచుపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. కూలీలు ఆధార్‌కార్డులను జాబ్‌కార్డులతో ఈకేవైసీ చేసుకుంటేనే అక్టోబరు నుంచి ఉపాధి పనులు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎన్ఆర్ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధికూలీ ఆధార్, ఉపాధికార్డు వివరాలను నమోదు చేసి కూలీ ముఖగుర్తింపు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కూలీలు తమ ఆధార్, జాబ్‌కార్డులతో ఉపాధిహామీ సిబ్బందిని కలిస్తే ఈకేవైసీ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇందుకోసం కూలీలు ఆధార్‌కార్డును తప్పనిసరిగా అప్డేట్ చేసుకుని ఉండాలి. ఈకేవైసీ పూర్తి చేయని కూలీలు ఇక నుంచి ఉపాధి పనుల్లో అవకాశం కోల్పోతారు.

అవకతవకలను నిరోధించేందుకు..

కూలీల హాజరును నేషనల్ మోబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు క్షేత్ర సహాయకులు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ, నిధులు స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు, ఒకరి పేరు మీద మరొకరు వెళ్తున్నట్లు నమోదు చేస్తున్నట్లు తేలింది. మరోవైపు సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయట పడటం, రికవరీలు జరుగుతున్నా ఏ మాత్రం మార్పు కనిపించడంలేదు. ఈ క్రమంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర చిత్రాలతోపాటు పని చేయకపోయినా చేసినట్లు అప్‌లోడ్ చేస్తున్నట్లు అనేక చోట్ల తేలింది. దీంతో కూలీలకు కూలీ గిట్టుబాటు కాక ఆశించిన స్థాయిలో వేతనాలు సైతం రావడం లేదు. గతంలో జాబ్‌కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానంచేసినా కొన్ని చోట్ల హాజరు నమోదులో తప్పిదాలు చేస్తున్నట్లు తేలింది. దీంతో వీటన్నింటికీ చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని తప్పనిసరి చేసింది.

హాజరు నమోదు ఇలా..

యాక్టివ్ కూలీల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి, పనికి రాగానే, పని పూర్తయ్యాక రెండుసార్లు ముఖ గుర్తింపు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఫొటోలు పనిప్రదేశంలోనేతీయాలి. కూలీలవివరాలు యాప్‌లో నమోదు కాకపోతే ఉపాధి పనికి వెళ్లినా హాజరు పడదు. దీంతో కూలీ డబ్బులు ఖాతాల్లో జమ కావు. వేరే ప్రాంతంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా అది తప్పుడు హాజరని నిర్ధారిస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఉపాధి హామీ పథకంలో అవకతవకలను నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

గత నెల 24 నుంచి నమోదు..

గత నెల 24 నుంచి జిల్లాలోని 471 గ్రామాల్లో కూలీల ఈకేవైసీ ప్రక్రియను ఉపాధి హామీ సిబ్బంది చేపడుతున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో మొత్తం 2,023 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 1.31 లక్షల యాక్టీవ్ జాబ్ కార్డులు ఉన్నాయి. మొత్తం కూలీల సంఖ్య 4.58 లక్షల ఉండగా, యాక్టీవ్ కూలీలు 2,21,051 మంది ఉన్నారు. వీరి వివరాలను ఈ యాప్ ద్వారా నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 1,09,597 మంది కూలీల వివరాలను ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది యాప్‌లో నమోదు చేశారు. ఇంకా 1,11,454 మంది కూలీల వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం



జిల్లాలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టాం. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ ముమ్మరంగా కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సమస్య వల్ల నెమ్మదిగా జరుగుతోంది. నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీలైనంత త్వరగా ఈకేవైసీని పూర్తి చేస్తాం.

– విద్యాచందన, డీఆర్‌డీఓ

నేడు బీటీపీఎస్ ఎదుట నిరసన

మణుగూరు రూరల్: భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం బీటీపీఎస్ గేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆదివాసీ జాతీయ నాయకుడు చందా లింగయ్య దొర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నష్టపరిహార చెల్లింపులు, ఉద్యోగాలు కల్పించడంలో బీటీపీఎస్ భూనిర్వాసితులకు అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ఉద్యోగాలు ఇవ్వకుండా, గిరిజనేతరులకు అక్రమమార్గాన ఇచ్చారని ఆరోపించారు. ఆదివాసీలు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆదివాసీలు ఉద్యమించాలి



కొమురంభీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

టేకులపల్లి: ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాటాలు నిర్వహించిన కొమురం భీమ్ ఆశయ సాధనకు ఆదివాసీలు ఉద్యమించాలని తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ కల్తి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కొమురం భీమ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ కావాలంటూ నైజాం నవాబులు, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరు సల్పారని అన్నారు. భద్రాచలంలో జరిగిన ధర్మ యుద్ధం సభ సక్సెస్ కావడంతో కొందరు లంబాడీ నాయకులు తప్పుడు కేసులు పెడుతున్నారని, ఆదివాసీ ఉద్యమాన్ని అణచివేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జోగ ప్రసాద్, మాడే రామకృష్ణ, ఈసాల రవి దొర, మాడే నవీన్, వాసం అనిల్, వాసం శ్రీను, పూణెం దేవరాజు, పూణే వెంకటేశ్వర్లు, మోకాళ్ల రవీందర్, ముడిగా హరీష్, పూణెం నాగరాజ్, ఈసం సత్యం పాల్గొన్నారు.

‘సౌర’ పందెం.. రూ.కోటి ఖాయం

- ఉమ్మడి జిల్లాలో కొణిజర్ల, భద్రాచలం ఎంపిక
- ఎంఎన్ఆర్ఈ ద్వారా ప్రజలకు ఉపయోగపడేలా సోలార్ ప్లాంట్లు
- ‘గృహజ్యోతి’తో ఇంకా ముందుకు రాని ప్రజలు



ఖమ్మంవ్యవసాయం: సౌర విద్యుత్ ఉత్పత్తిని విస్తృతపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలతో కూడిన పథకాలను అమలుచేస్తోంది. ప్రధాన మంత్రి సూర్యఘర్, ప్రధానమంత్రి కుసుమ్ వంటి పథకాలు ఉండగా.. మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెనివబుల్ ఎనర్జీ(ఎంఎన్ఆర్ఈ) పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ విలేజ్‌లకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. నిబంధనల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించిన గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడేలా ఈ నిధులు వినియోగిస్తారు. మోడల్ సోలార్ విలేజ్‌గా పరిగణించడానికి తాజా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 5 వేలకు మించి ఉండాలి. ఇక 2025 ఏప్రిల్ నుంచి ఆరు నెలల కాలాన్ని గడువుగా నిర్దేశించగా.. ఈ సమయంలో నిబంధనల ప్రకారం అధికంగా సౌర విద్యుత్ కనెక్షన్లు, సామర్థ్యాన్ని బట్టి జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తారు. ఆ గ్రామానికి ఎంఎన్ఆర్ఈ పథకం కింద రూ. కోటి విలువైన సౌర ప్లాంట్ల నజరానా ప్రకటించారు. దేశవ్యాప్తంగా అమలుచేస్తున్న ఈ పథకాన్ని ఖమ్మం జిల్లాలో ఏప్రిల్ 4 నుంచి అక్టోబర్ 3 వరకు, భద్రాద్రి జిల్లాలో ఏప్రిల్ 9 నుంచి అక్టోబర్ 8వరకు అమలు చేశారు. విద్యుత్ శాఖ పర్యవేక్షణలో రెడ్ కో సంస్థ ఈ పోటీలు నిర్వహించింది.

పోటీ పడిన గ్రామాలు 22..

ఎంఎన్ఆర్ఈ పథకం కింద నిబంధనల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 22 గ్రామాలు ఎంపికయ్యాయి. ఖమ్మం జిల్లాలో అన్నారుగూడెం(తల్లాడ మండలం), నేలకొండపల్లి, కొణిజర్ల, వల్లభి(ముదిగొండ మండలం), తనికెళ్ల(కొణిజర్ల మండలం), తల్లాడ, ముదిగొండ, కందుకూరు(వేంసూరు) గ్రామాలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో అశ్వాపురం, భద్రాచలం, సారపాక, నాగినేనిప్రోలు(బూర్గంపాడు మండలం), రుద్రంపూర్(చుంచుపల్లి మండలం), దమ్మపేట, కూనవరం(మణుగూరు మండలం), ముల్కలపల్లి, బూర్గపాడు, చంద్రుగొండ, బాబూక్యాంప్(చుంచుపల్లి మండలం), మందలపల్లి(దమ్మపేట మండలం), సమితి సింగారం(మణుగూరు మండలం) చర్ల గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అర్హులైన వారికి సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సూర్య ఘర్ పథకం కింద రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఇంటి పైకప్పు 100 నుంచి 300 ఆపైన స్క్వేర్ ఫీట్ ఉన్న భవనాలకు అవకాశం కల్పించారు. ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు రూ.30 వేల రాయితీ, 2 కిలోవాట్ల సౌరప్లాంట్‌కు రూ. 60 వేలు, 3 కిలోవాట్ల సౌరప్లాంట్‌కు రూ.78 వేల రాయితీ సౌకర్యం కల్పించారు.

రూ.కోటి నజరానా

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో నిర్వహించిన మోడల్ సోలార్ విలేజ్ పథకం పోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి కొణిజర్ల, భద్రాద్రి జిల్లా నుంచి భద్రాచలం గ్రామాలు విజేతలుగా నిలిచాయి. భద్రాచలంలో 180 విద్యుత్ సర్వీసులు సౌర విద్యుత్‌కు అనుసంధానం పొందగా 2 వేల కిలోవాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పునరుత్పత్తి చేస్తున్నాయి. ఖమ్మం జిల్లా కొణిజర్ల కూడా అత్యధికంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని ముందంజలో నిలిచింది. దీంతో ఈ రెండు గ్రామాలను రెండు జిల్లాల స్థాయిలో మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపిక చేశారు. సోలార్ పథకం కింద విజేతలుగా నిలిచిన గ్రామాలకు విడుదల చేసే రూ. కోటి నిధులను ఆయా గ్రామాల్లో ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని నిర్దేశించారు.

ప్రభావం చూపుతున్న ‘గృహజ్యోతి’

రాష్ట్ర ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని గృహజ్యోతి పథకం కింద కల్పించింది. గ్రామాల్లో 80 శాతం మంది విద్యుత్ కనెక్షన్లు ఈ పథకంలో ఉన్నాయి. దీంతో ఉచిత విద్యుత్ పొందుతున్న లబ్ధిదారులు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. 3 కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటుకు కంపెనీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు ఖర్చవుతుంది. కిలోవాట్లు తగ్గితే వ్యయం కూడా తగ్గుతుంది. అయితే ఈ పథకం ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పించినా.. వినియోగదారులకు సిబిల్ స్కోర్ ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. చాలా మందికి సిబిల్ స్కోర్ సరిగా లేక రుణాలకు అర్హత సాధించలేక పోయారు. దీంతో మోడల్ సోలార్ విలేజ్ పథకానికి అంతగా ఆసక్తి చూపడం లేదు.



విద్యాశాఖాధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు(ఫైల్)

వేతన వెతలు

- మధ్యాహ్న భోజన కార్మికులకు అందని జీతాలు
- కోడి గుడ్లు, వంట బిల్లులు కూడా పెండింగ్‌లోనే
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని ప్రభుత్వం

కొత్తగూడెంఅర్బన్: బిల్లులు, వేతనాలు రాక ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. దసరా పండుగ వేళ వేతనాలు, బిల్లులు వస్తాయని ఆశ పడిన వారికి నిరాశే మిగిలింది. కనీసం దీపావళి పండుగ లోపైనా విడుదల చేస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2,150 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారు. వీరికి చాలీచాలని వేతనం నెలకు రూ.3 వేలు ఇస్తుండగా, అది కూడా సక్రమంగా విడుదల చేయడంలేదు. వంట బిల్లులు, ఎగ్ బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో కూరగాయలు, గుడ్లు అప్పు చేసి కొంటున్నామని కార్మికులు వాపోతున్నారు. విద్యార్థులకు వారానికి మూడు కోడి గుడ్లను ఇవ్వాల్సి ఉండగా, బిల్లులు సకాలంలో రాక పోవడంతో చాలా పాఠశాలల్లో కోడి గుడ్లను అందించడంలేదు. దీంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

జూన్ నుంచి వేతనాలు రాట్లే..

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కార్మికుల వేతనాలు విడుదల కావడం లేదు. వంట బిల్లులు గత మార్చి నుంచి ఇవ్వడంలేదు. కోడి గుడ్ల బిల్లులు కూడా గత జూన్ నుంచి చెల్లించాల్సి ఉంది. గుడ్డుకు ప్రభుత్వం రూ.6 చొప్పున చెల్లిస్తుండగా, బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధర ఉంటోంది. పట్టణాలు, మండల కేంద్రాల్లో రూ.7, ఏజెన్సీ ప్రాంతం, మారుమూల ప్రాంతాల్లో రూ.8 వరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులపై భారం పడుతోంది.

పోరాటానికి సిద్ధం

వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని కోరుతూ డీఈఓ, జిల్లా అధికారులకు మధ్యాహ్న భోజన కార్మికులు వినతులు అందజేశారు. గత 10వ తేదీలోగా వేతనాలు, బిల్లులు వచ్చే విధంగా చూస్తామని అధికారులు హామీ ఇచ్చినా విడుదల కాలేదు. దీంతో కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. నిరసన దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

ఆందోళనలు నిర్వహిస్తాం



మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, బిల్లులు నెలల తరబడిగా పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల పండుగ రోజుల్లో కూడా అవస్థలు పడాల్సివస్తోంది. అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం 10న బిల్లులు విడుదల కాలేదు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నిరసన తెలుపుతాం.


–సత్తెనపల్లి విజయలక్ష్మి, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

‘మద్యం’ దరఖాస్తులు 102

ఎక్సైజ్ శాఖకు రూ.3.06 కోట్ల ఆదాయం

పాల్వంచరూరల్: నూతన వైన్‌షాపుల లైసెన్స్ మంజూరు ద్వారా ప్రభుత్వం ఆశించిన ఆదాయం వచ్చే పరిస్థితి కన్పించడంలేదు. శనివారం వరకు జిల్లాలో కేవలం 102 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. తద్వారా రూ.3.06 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది షాపు లైసెన్స్ కోసం రూ.2 లక్షలు మాత్రమే ఉండగా, ఈ సారి రూ.3 లక్షలకు పెంచారు. దీంతో వైన్‌షాపుల లైసెన్స్‌కోసం ఆసక్తి చూపడంలేదనే చర్చ సాగుతోంది. గతంలో మద్యం వ్యాపారులు పోటీలు పడి ఒక్కొక్కరు ఐదు, పది షాపులకు దరఖాస్తు చేసుకునేవారు. ఈసారి మాత్రం ఉత్సాహం చూపడంలేదు. గడువు లోగా ఆశించిన మేరకు దరఖాస్తులు వస్తాయనే భావనలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు. ఇప్పటివరకు మణుగూరు, కొత్తగూడెం ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో తక్కువ దరఖాస్తులు రాగా, అశ్వారావుపేటలో అధికంగా 63 దరఖాస్తులు వచ్చాయి.

ఎక్సైజ్ స్టేషన్	షాపులు	దరఖాస్తులు	ఆదాయం (రూ.లక్షల్లో)
పాల్వంచ	13	6	18
అశ్వారావుపేట	11	63	189
ఇల్లెందు	14	20	60
మణుగూరు	15	3	9
కొత్తగూడెం	19	1	3
భద్రాచలం	16	9	27
మొత్తం	88	102	306



గడువులోగా వస్తాయి

నూతన వైన్ షాపుల లైసెన్స్ కోసం శనివారం వరకు 102 దరఖాస్తులు వచ్చాయి. శనివారమే 50 దరఖాస్తులు అందాయి. ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉంది. ఆలోగా అనుకున్న మేర దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నాం.

–జానయ్య, జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్

నిర్విరామ కృషితోనే సాధ్యం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ మేనేజర్లు, సిబ్బందికి అభినందన





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి

దమ్మపేట:అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు, సిబ్బంది నిర్విరామ కృషితోనే మూడు లక్షల టన్నుల పామాయిల్ గెలల క్రషింగ్ సాధ్యమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిర్దేశిత క్రషింగ్ లక్ష్యాన్ని సాధించిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీ ప్రాంగణంలో అధికారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల మేనేజర్లు కళ్యాణ్, నాగబాబులతోపాటు సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయిల్‌పామ్ సాగులో ఎకరాకు 12 టన్నులు పైబడి దిగుబడి సాధించిన రైతులు స్వీయ అనుభవాలను వివరించారు. వారినీ సన్మానించారు. మహారాష్ట్రకు చెందిన రైతు చంద్రశేఖర్ వ్యవసాయంలో అనుసరిస్తున్న రీజనరేటివ్ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రీజనరేటివ్ విధానాన్ని పరిశీలించేందుకు 40 మంది రైతులను అక్కడికి పంపుతామన్నారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించి, రాబోయే సంవత్సరానికి నూతన ఫ్యాక్టరీ నిర్మించే దిశగా ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ఆయిల్‌ఫెడ్ సిబ్బందికి పదోన్నతి కల్పించాలన్నారు. తోటల్లో ఆయిల్‌పామ్ చెట్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు లైన్లను మార్చాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్‌ను ఆదేశించారు. అప్పారావుపేట గ్రామ అభివృద్ధి, అశ్వారావుపేటలో డివైడర్ నిర్మాణానికి ఆయిల్‌ఫెడ్ నిధులు కేటాయిస్తామన్నారు. ములకలపల్లి మండలంలో పది వేల ఎకరాల సాగు విస్తీర్ణం దాటితే ఫ్యాక్టరీ నిర్మిస్తామని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ మొక్కలను పెంచడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అత్యధిక ఓఈఆర్ 19.92ను సాధించడంతో రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ రైతులు మునగ, వెదురు, కూరగాయలు సాగు, పట్టు పురుగుల పెంపకంపై కూడా దృష్టి సారించాలని అన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ పేటలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీ నెలకొల్పాలని, అచ్యుతాపురంలో ఖాళీగా ఉన్న 40 ఎకరాల భూ విస్తీర్ణంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఓఎస్‌డీ కిరణ్ కుమార్, డీఎం రాధాకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, నాగబాబు, రాఘవరావు, పైడి వెంకటేశ్వరరావు, గంగాధరరావు, కాసాని నాగప్రసాద్, కె.వి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడ్డీ వ్యాపారులకు మావోయిస్టుల హెచ్చరిక

దుమ్ముగూడెం: అవసరాన్ని బట్టి పేద ప్రజల వద్ద పెద్ద మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులను హెచ్చరిస్తూ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న పేరుపై మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. అధిక వడ్డీలు కట్టలేని పరిస్థితిలో పేదలు ఉన్నారని, పద్ధతి మార్చుకోవాలన్నారు. వ్యాపారుల దౌర్జన్యాలు తట్టుకోలేక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొందరు చనిపోతున్నారని, మరికొందరు ఆస్తులు అమ్ముకుని రోడ్డుపై పడుతున్నారని తెలిపారు.

ఐఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్


శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: ఇండియన్ స్కౌట్స్, గైడ్ ఫెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లోగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి కొత్తగూడెం సింగరేణి చిల్డ్రన్ పార్కులోని భారత్ స్కౌట్స్, గైడ్స్ సింగరేణి కార్యాలయంలో సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి సింగరేణి జీఎం వెల్ఫేర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఐఎస్‌జీఎఫ్ జాతీయ అధ్యక్షుడు (ఎగ్జిక్యూటివ్) మ్యాక్ మిక్కి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లోగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా.. అందరూ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఐఎస్‌జీఎఫ్ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్ నిఖిల్ ఆస్పత్రి నుంచి కార్డియాలజీ – న్యూరాలజీ, యురాలజీ, డెక్కన్ ఆస్పత్రి నుంచి గ్యాస్ట్రోఎంట్రాలజీ – నెఫ్రాలజీ వైద్యులు హాజరై సేవలు అందించారు. మొత్తం 143 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాశేశ్వరరావు, డా.లలిత, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ పీబీ అవినాష్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఈటీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా జె.సోమన్న (ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.సునీల్ రెడ్డి (బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్), ఉపాధ్యక్షులుగా పి.అజయ్, ఎస్.కుమారస్వామి, బి.రమేశ్, జి.సునీత, కోశాధికారిగా ఎస్.కిరణ్‌కుమార్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.కుమారస్వామి, కె.మధుకర్, బి.వెంకట్రామ్, జె.జేత్యాతోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మహ్మద్ కరీం వ్యవహరించారు. నాలుగేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది.

ఎస్సీ వర్గీకరణ ఓ రాజకీయ కుట్ర


- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై అతిపెద్ద రాజకీయ కుట్ర జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ పేరుతోనే దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందా? అని, ముఖ్యమంత్రి పదవికి సామాజిక న్యాయం అవసరం లేదా..? అని ప్రశ్నించారు. పంజాబ్, హరియాణాలో తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టిందని, దానిని ప్రధానమంత్రి మోదీ దేశవ్యాప్తం చేశాడని ఆరోపించారు. శాస్త్రీయత లేని, రాష్ట్ర జనాభా లెక్కలతో ఎస్సీ రిజర్వేషన్ వల్ల చాలా తక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో కామ ప్రభాకర్ రావు, బల్లెం లక్ష్మణ్, మిరియాల బాలశౌరి, తోట దుర్గాప్రసాద్, కనికెళ్ల నాని, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400


ప్రధాన రహదారిపై మట్టి పోయడంతో బురదమయంగా మారిన దృశ్యం


అధ్వానంగా మారిన భద్రాచలం - చర్ల ప్రధాన రహదారి

పట్టదా ఎవరికీ..?

భద్రాచలం - చర్ల రహదారి గుంతలమయం..

- గంటల కొద్దీ ప్రయాణంతో ప్రజలు బెంబేలు
- రోడ్ల పర్యవేక్షణ గాలికొదిలేసిన పాలకులు
- ప్రజా ప్రతినిధులపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం

భద్రాచలం: భద్రాచలం నుంచి చర్లకు వెళ్లి రావాలంటే ప్రయాణికులకు నరకమే. ఆ మార్గంలో గాయపడకుండా.. ఇబ్బంది లేకుండా ప్రయాణించలేం. గుంతలమయమైన రహదారిలో ఇసుక లారీలు నిరంతరం తిరుగుతుండటంతో ట్రాఫిక్ జాం కూడా అవుతోంది. దీంతో గంటల కొద్ది ప్రయాణికులు నిరీక్షిస్తూ నానా అవస్థలు పడుతున్నారు. భద్రాచలం నుంచి చర్ల వెళ్లే వరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యగా ఉన్న దీనిపై రెండు ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు మౌనం దాల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడుగుకో గుంత..

భద్రాచలం నుంచి చర్లకు వయా దుమ్ముగూడెం మండలం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అందులో లక్ష్మీనగరానికి వెళ్లే దారిలో ఏపీ రాష్ట్రం ఏడు కిలోమీటర్ల పరిధి ఉంటుంది. ఏపీలోని చింతలగూడెం, సీతంపేట, కన్నాయిగూడెం, తెలంగాణలోని దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక డైవర్షన్ రోడ్డు, కల్వర్టు, నర్సాపురం, రేగుబల్లి, గంగోలు, బుర్రవేముల, లక్ష్మీనగరం, ములకలపాడు, దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు వరకు రోడ్లన్నీ గుంతలమయమే. చర్ల మండలంలో సుబ్బంపేట, కొయ్యూరు, చర్ల, రైస్‌పేట, గుంపెనగూడెం, కలివేరు, కుదునూరు, దేవరపల్లి గ్రామాల్లోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. భద్రాచలం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే చర్ల నుంచి వెంకటాపురం రోడ్డు సైతం పూర్తిస్థాయిలో పాడైపోయింది. అడుగు దూరానికో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. అడుగు నుంచి రెండు అడుగుల లోతులో భారీ గుంతలు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పర్ణశాలకు తగ్గిన భక్తుల రాక..

భద్రాచలంలో కొలువై ఉన్న శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న అనంతరం అనుబంధ ఆలయంగా ఉన్న పర్ణశాలకు భక్తులు వెళ్లటం పరిపాటి. దుమ్ముగూడెం మండలంలో ఉన్న పర్ణశాలకు ఈ రహదారే మార్గం. ప్రస్తుతం రోడ్డు తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో భక్తులు పర్ణశాలకు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. కేవలం భద్రాచలం రామయ్యను దర్శించుకొని తిరుగుబాట పడుతున్నారు. దీంతో పర్ణశాలకు భక్తుల రాక తగ్గటంతో పాటుగా ఆదాయం గణనీయంగా తగ్గింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న చిరు వ్యాపారుల జీవనోపాధికి గండి పడింది.

పర్యవేక్షణ కరువు..

ఇటీవల కాలంలో చర్ల ఇసుక ర్యాంపుల నుంచి లారీలు దుమ్ముగూడెం, భద్రాచలం మీదుగా వెళ్తున్నాయి. గుంతలతోనే వేగలేకపోతున్న ప్రయాణికులు లారీల రాకపోకలతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారులను ఆర్అండ్‌బీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. తెలంగాణలో కాంగ్రెస్, ఏపీలోని టీడీపీ రహదారుల పర్యవేక్షణను గాలికొదిలేశాయి. మట్టితో గుంతలను తూతూమంత్రంగా పూడుస్తున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ, ప్రభుత్వాలు స్పందించకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన ప్రధాన రహదారికి మరమ్మతులు నిర్వహించాలని, ఇసుక లారీలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు సైతం నిరసన కార్యక్రమాలతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.

నిర్లక్ష్యంగా ప్రభుత్వం



భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు నిర్వహించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రజా రవాణాకు ఆటంకం కలిగిస్తున్న ఈ సమస్యను ఇటు తెలంగాణలోని కాంగ్రెస్, అటు ఏపీలోని టీడీపీ ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలి. లేని పక్షంలో ప్రజాపోరాటానికి సిద్ధమవుతాం.

–రావులపల్లి రాంప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు

కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్


భారీగా నిలిచిన ఇసుక లారీలు


చర్ల - భద్రాచలం మార్గంలో ట్రాఫిక్ జామ్

దుమ్ముగూడెం: మండలంలో ఇసుక లారీలు వందల సంఖ్యలో రావడంతో తూరుబాక నుంచి పెద్దనల్లబల్లి వరకు కొన్ని కిలో మీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏపీలోని సీతపేటం వద్ద భద్రాచలం – చర్ల ప్రధాన రహదారిపై రెండు ఇసుక లారీలు దిగబడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వందల సంఖ్యలో లారీలు ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో సామాన్య ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఇసుక లారీలను ములకపాడు వయా మారాయిగూడెం నుంచి డైవర్షన్ చేసి పంపినప్పటికీ అటువైపు కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ట్రాఫిక్ జామ్ కొనసాగింది.

రహదార్లపైనే నిలుపుతున్న ఇసుక లారీలు

చర్ల: మండలంలో కొనసాగుతున్న ఇసుక క్వారీల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక రవాణా కోసం వచ్చే లారీలకు ఇసుక రీచ్‌ల నిర్వాహకులు యార్డులను ఏర్పాటు చేయకపోవడంతో లారీ డ్రైవర్లు ఎక్కడబడితే అక్కడ లారీలను నిలుపుతుండడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యి గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా తిరుగుతున్న ఓవర్ లోడ్ ఇసుక లారీలు వల్ల రోడ్లు ఎక్కడికక్కడే కృంగిపోయి పెద్ద ఎత్తున లారీలు దిగబడుతున్నాయి. ఇసుక రీచ్‌ల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎందుకు లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిత్యం భద్రాచలం వెంకటాపురం రహదారిపై మండలంలోని రాళ్లగూడెం (పర్ణశాల) నుంచి సుబ్బంపేట వరకూ నిత్యం లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యవసర పనుల కోసం పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన జనం ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం భద్రాచలం వెంకటాపురం మార్గంలో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ కాగా, చర్ల నుంచి భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఏడు గంటలు, చర్ల నుంచి వెంకటాపురం వెళ్లే ప్రయాణికులకు ఐదు గంటల సమయం పడుతోంది. ఇసుక రీచ్‌ల వద్ద లోడింగ్ కోసం వచ్చిన లారీల కోసం యార్డులు ఏర్పాటు చేయకపోవడంతో డ్రైవర్లు, క్లీనర్లు నానా అవస్థలు పడుతున్నారు.

భార్యతో కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

మధిర: ఏడేళ్లుగా అక్రమ సంబంధాలు పెట్టుకుని, అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్‌పై ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మధిర పట్టణంలోని బంజారాకాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్‌కు ఏడేళ్ల కిందట మౌనికతో వివాహం జరిగింది. శ్రీకాంత్‌తో పాటు అతని తల్లి నాగమణి, భార్య మౌనిక ముగ్గురు కలిసి మధిరలో జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా అదనపు కట్నం కోసం శ్రీకాంత్ అతని తల్లి నాగమణి వేధింపులకు గురిచేస్తున్నారు. పలుమార్లు పంచాయితీ పెట్టించినప్పటికీ శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో మౌనిక పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించగా వారు.. శ్రీకాంత్‌కు నచ్చజెప్పారు. అయినా శ్రీకాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు కేసు పూర్వాపరాలు తెలుసుకుని ఏఆర్ కానిస్టేబుల్ వనమా శ్రీకాంత్, అతని తల్లి నాగమణిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మౌనికను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

ఖమ్మంక్రైం : బందోబస్తులో ఉన్న పోలీసులను నెట్టివేసి, విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. వీడీఓస్ కాలనీలో గొడవ జరుగుతోందనే సమాచారంతో ఎస్ఐ రమేశ్, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లారని, ఈ క్రమంలో చేకూరి శేఖర్‌బాబు, తాళ్లూరి గంగాధర్, కంచర్ల అభిలాష్ ఎస్ఐ రమేశ్‌తో పాటు సిబ్బందిని నెట్టివేశారని తెలిపారు. ఎస్ఐ రమేశ్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

ముగిసిన టీటీ ర్యాంకింగ్ టోర్నీ



బహుమతులు అందజేస్తున్న పునుకొల్లు నీరజ, తుమ్మల యుగంధర్

ఖమ్మం స్పోర్ట్స్ : మూడు రోజులుగా నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన బాలసాని సాన్యసయ్య స్మారక రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడా సంఘాల బాధ్యుల కృషి వల్లే ఖమ్మంలో విరివిగా రాష్ట్రస్థాయి టోర్నీలు జరుగుతున్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, రాష్ట్ర టీటీ అసోసియేషన్ అధ్యక్షులు కె.కె.మహేశ్వరి, కార్యదర్శి సి.నాగేందర్‌రెడ్డి, ఎస్.లక్ష్మీకాంత్, సీనియర్ కోచ్ సోమనాథ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–11 బాలికల విభాగం ఫైనల్స్‌లో అపర్ణ, యశశ్రీ, అండర్–13 విభాగంలో డి.అవంతిక, బి.వి.మహిమకృష్ణ, అండర్ –15 విభాగంలో బి.వి.మహిమకృష్ణ, గాయత్రి కృష్ణ, అండర్–17 విభాగంలో అవంతిక, పి.జలని, అండర్–19 విభాగంలో కె.శ్రేష్ఠ, వైష్ణవి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలుర అండర్–11 విభాగంలో ఎం.విహాన్, నివాస్, అండర్–13 విభాగంలో సాగర్, పి.వేదాన్ష్, అండర్–15 విభాగంలో జె.ఎ.విలోహిత్, ప్రమాణ్, అండర్–17 విభాగంలో ఎం.ధర్మతేజ సాయి, పి.శ్రీహాసీష్, అండర్–19 విభాగంలో అరుష్‌రెడ్డి, ఎం.దేవాన్ష్, పురుషుల విభాగంలో స్వర్నెండ్ చౌదరి, బి.వరుణ్ శంకర్, మహిళల విభాగంలో నిఖితా బాను, వరుణి జైస్వాల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

గైనకాలజిస్టులు లేక బాలింత కొత్తగూడెం తరలింపు

గర్భంలోనే శిశువు మృతి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టులు లేక సరైన సమయంలో వైద్యం అందక గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ఎర్రవు వినయ్ సివిల్ విభాగంలో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, భార్య స్వాతి 9 నెలల గర్భిణి. స్వాతికి తరచూ షుగర్ రావడంతో రోజూ క్రమం తప్పకుండా ఇన్సులిన్ వేసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో మణుగూరు సింగరేణి ఆస్పత్రిలో గైనకాలజిస్టు లేకపోవడంతో భర్త వినయ్ కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ క్రమంలో మణుగూరు ఆస్పత్రికి సాధారణ పరీక్షల కోసం వెళితే కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి రిఫర్ చేశారని అక్కడ గుండె చప్పుడు పరిశీలించిన వైద్యులు ప్రైవేట్ స్కాన్ చేయించగా, అప్పటికే శిశువు మృతి చెందిందని తెలిపారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ ఉంటే శిశువు ప్రాణం దక్కి ఉండేదని కన్నీటి పర్యంతమయ్యాడు. కాగా, ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, పీడియాట్రిక్‌లు లేక శిశువును గర్భంలోనే కోల్పోవడం బాధాకరమని రేణుక అక్షర మహిళా సంఘం బాధ్యులు పేర్కొన్నారు.

నిధులు అరకొరే..

- జెన్‌కో లాభాల్లో 2 శాతం వెచ్చింపుల్లో తేడాలు
- విడుదలైన నిధులు ఇతర ప్రాంతాలకు బదలాయింపు
- పాల్వంచకే కేటాయించాలని డిమాండ్


పాల్వంచ పట్టణ వ్యూ

పాల్వంచ: పరిశ్రమల సామాజిక బాధ్యతగా వెచ్చించాల్సిన నిధులు అరకొరగానే విడుదల చేస్తున్నారు. కర్మాగారాల నుంచి నిత్యం వెలువడే కాలుష్య ఉద్గారాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఆయా ప్రాంతాల వారికి వైద్య సౌకర్యాలతో పాటు, అభివృద్ధికి తమవంతు సహకారం అందించాల్సి ఉంటుంది. పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారం నుంచి నిత్యం 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో బొగ్గును మండించడం ద్వారా జల, వాయు కాలుష్యం అధికంగా ఉంటుంది. కాలుష్యం వల్ల ఈ ప్రాంత ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతుండటంతో యాజమాన్యం సామాజిక బాధ్యతగా ఏటా సీఎస్ఆర్ నిధులు విడుదల చేసి, అభివృద్ధిలో భాగస్వామి కావాల్సి ఉంది. కానీ, దీనిని పాటించడంలో జెన్‌కో యాజమాన్యం, జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చాలీచాలని నిధులు..

సీఎస్ఆర్ నిధులు విడుదల కోసం జిల్లా కలెక్టర్ జెన్‌కో యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది. అనంతరం కలెక్టర్ ఖాతాలోకి నిధులు విడుదల చేస్తారు. వాటి నుంచి కలెక్టర్ సూచించిన చోట అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో సీఎస్ఆర్ నిధులను కొత్తగూడెం, మహబూబాబాద్ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనులకు కేటాయించినట్లు సమాచారం. కర్మాగారం ఉన్న పాల్వంచలో ప్రజలు కాలుష్యం వల్ల ఇబ్బందులు పడుతుండగా ఆ నిధులను ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతాలకు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 2022–23లో రూ.కోటి నిధులకు ప్రతిపాదనలు పంపించగా రూ.30 లక్షలు ఖర్చు చేశారు. ఇంకా రూ.70 లక్షలు ఖర్చుచేయాల్సి ఉంది. 2023–24లో రూ.3.72 కోట్లు విడుదల కాగా నిధులు ఖర్చు చేశారు. ఇక 2024–25 సంవత్సరంలో రూ.1.07 కోట్లకు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరైనా వాటిని ఇంకా అధికారులు ఖర్చు చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. ఏడాది ముగుస్తున్నా అధికార యంత్రాంగం ఈ నిధులను ఇంకా ఎక్కడ వినియోగించాలనేది తేల్చక తాత్సారం చేస్తున్నారు.

నిధులు విడుదల చేస్తున్నాం..



సీఎస్ఆర్ నిధుల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపిస్తే వాటిని జెన్‌కో యాజమాన్యం పరిశీలించి విడుదల చేస్తోంది. అయితే వీటిని ఎక్కడ ఖర్చు చేయాలనేది మాత్రం మా పరిధిలో లేదు. జిల్లా అధికారులే చూస్తారు. రెండు సంవత్సరాల కాలంలో కొత్తగూడెం, పాల్వంచ మైనార్టీ, బీసీ కళాశాలల్లో భవనాలు, ఆడిటోరియం నిర్మించారు. ఇతర అభివృద్ధి పనులను కూడా అధికారులే చూడాల్సి ఉటుంది.

– శ్రీనివాసబాబు, సీఈ, కేటీపీఎస్ 7వ దశ

2 శాతం కేటాయింపులేవి

జెన్‌కో యాజమాన్యం ఏటా లాభాల్లో 2 శాతం సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ నిధులు అతి తక్కువగా మాత్రమే విడుదల అవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానికంగా సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేయాలని, తరచూ వైద్య శిబిరాలు, నాణ్యమైన విద్య, ప్రజలకు నిత్యం ఉపయోగ పడే చోట అభివృద్ధి పనులు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళికలు, నర్సరీల ఏర్పాటు, రోడ్ల విస్తరణ, వృత్తి విద్య, ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలం చెందారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు లాభాల వాటలోని 2 శాతం నిధులు వెచ్చించడంతో పాటు, వాటిని స్థానికంగానే ఖర్చు చేయాలని, శాశ్వత ప్రాతిపాదికన సమస్యలకు పరిష్కార మార్గాలు రూపొందించాలని ప్రజలుకోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు బలి


పెద్దవాగులో మహేశ్ మృతదేహం ఇన్‌సెట్ మహేశ్ (ఫైల్)

కరకగూడెం: విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వట్టంవారిగుంపు పరిధి అరెంవారిగుంపు గ్రామానికి చెందిన కొమరం మహేశ్ (26) కరకగూడెం పెద్దవాగు పరివాహక ప్రాంతంలో పొలం కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటార్‌కి విద్యుత్ తీగలు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెద్దవాగులో యువకుడి మృతదేహం కనిపించడంతో కన్నీటి పర్యంతమయ్యారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


బంధం లక్ష్మీ నారాయణ (ఫైల్)

చింతకాని: మండలంలోని నాగులవంచ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం లక్ష్మీనారాయణ (45) మృతి చెందగా అతని కుమారుడు గగన్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావటంతో ద్విచక్ర వాహనంపై తన కుమారుడితో కలిసి ఖమ్మం నుంచి ముష్టికుంట్ల గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో నాగులవంచ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో లక్ష్మీనారాయణతో పాటు కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొద్ది సేపటికే లక్ష్మీనారాయణ మృతి చెందగా, కుమారుడు గగన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న సొందే సాయి ఆదివారం ఉదయం 11.40 గంటల సమయంలో పాతబ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్థానికంగా ఉన్న గజ ఈతగాడు కరకు ప్రసాద్ సహాయంతో సాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా సాయి స్వస్థలం ఏలూరు జిల్లా కుక్కునూరు మండల పరిధిలో గల వెలేరుపాడు. సాయికి భద్రాచలం పట్టణానికి చెందిన నాగజ్యోతితో వివాహం కాగా వీరికి ఒక కుమార్తె ఉంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


అనుమానిత వ్యక్తుల వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలుచేపట్టారు. ఆదివారం రాత్రి పట్టణంలోని బ్రిడ్జి పాయింట్, బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. బయోమెట్రిక్ ఆధారంగా అనుమానిత వ్యక్తుల వివరాలు తెలుసుకున్నారు. రాత్రిపూట ప్రయాణికులు లేకుండా తిరుగుతున్న ఆటోలను నిలిపి డ్రైవర్లను ప్రశ్నించారు. పలువురు యువతకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రైవేటు బస్సులను సైతం తనిఖీ చేసి అనుమతి పత్రాలను నిశితంగా పరిశీలించారు. ఆయా బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిని లగేజీలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి సీఐ నాగరాజు పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మణుగూరుకు చెందిన రాపర్తి లక్ష్మి ఆటోలో కొత్తగూడెం వైపు వెళ్తుండగా మొండికుంట వద్ద మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై గుంత ఉండటంతో ఆటోలో నుంచి మహిళ అదుపుతప్పి రహదారిపై పడి తీవ్రంగా గాయపడింది. ఆమెను 108లో మణుగూరు తరలించి అక్కడి నుంచి భద్రాచలం తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

- 2023 VE CV Eicher Pro 3019 TS04UE 2879, 2022 Tata Intra V30 TS28TA8929 and 2023 Renault Kwid TS26H4652 are available for sale in as where it is condition. Cont. Sundaram Finance Ltd, Khammam 9440909753 [SCA 25008980]

Wanted

- RVR Jobs Promoters: ఖమ్మంలోని ప్రముఖ ఆఫీసుల్లో కం॥ ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, అకౌంటెంట్, క్యాషియర్స్, టెలికాలర్స్, సూ॥ వైజర్స్, సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 96527 21200 [M-14077]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.